క్లుప్తంగా

ఆదాయం పెంపునకు కృషి చేయండి



ఆదర్శ ఉద్యోగులకు చెక్కు అందిస్తున్న డీఎం ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఆదాయం పెంపునకు సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి కృషి చేయాలని డీఎం ఇనయతుల్లా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. గత నెలలో తమకు ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువ ఆదాయం తెచ్చిన కండక్టర్లు, డీజిల్ పొదుపు సాధించిన ముగ్గురు డ్రైవర్లకు నగదు పురస్కారాలు అందజేసి శాలువలు, పూలమాలతో సత్కరించారు.

రెండో రోజూ కొనసాగిన నిరసన



డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

కదిరి అర్బన్: ఉద్యోగ భద్రతా సర్క్యులర్ అమలు చేయాలని కోరుతూ స్థానిక డిపో ఎదుట ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు శుక్రవారంతో రెండో రోజు నిరసన కార్యక్రమం కొనసాగించారు. యాజమాన్యం స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ వీ రమణ, సురేంద్ర, రామచంద్ర, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కళాశాల సిబ్బంది

అమడగూరు: శీతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సెకండియర్ విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యామిత్ర పథకం కింద పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. అధ్యాపక సిబ్బంది రఘునాథరెడ్డి, షానవాజ్, గంగన్న, జయరాం నాయక్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలను ప్రోత్సహించండి



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

బత్తలపల్లి: ప్రతి రైతు భూసార పరీక్షలు చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, అనంతపురం భూసార పరీక్ష కేంద్రం ఏఓ శ్రీనాథ్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని రైతులు, రైతు సేవ కేంద్రం సిబ్బందికి భూసార పరీక్షల ఆవశ్యకత, భూసార పరీక్ష కోసం నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. ఇలా చేస్తే భూ ఆరోగ్యంతోపాటు రైతులకు అనవసరమైన ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. మండలంలో ఇంకా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయించుకోని రైతులు తొందరగా సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో చేసుకోవాలని సూచించారు. ఏఓ ఓబిరెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ కోసం పడిగాపులు



సీహెచ్‌సీలో వేచి ఉన్న వికలాంగులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం వికలత్వం పెన్షన్ పొందుతున్న వారికి సదరం పున: పరిశీలన శిబిరం నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వికలాంగులు ఉదయం 9 గంటల ఆసుపత్రికి చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట అయినా డాక్టర్ రాకపోవడంతో వారు భోజనం కూడా తినకుండా ఎదురు చూడాల్సి వచ్చింది. కొందరు ఆసుపత్రిలోనే వేచి చూడగా.. మరికొందరు చెట్ల కింద, ఆటోల్లో ఉంటూ నిరీక్షించారు. సుమారు 1:30 గంటలకు డాక్టర్ ఆస్పత్రికి చేరుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డాక్టర్లు నిర్ధీత సమయానికి హాజరయ్యేలా చూడాలని వికలాంగులు కోరారు.

సేవలు నిల్.. సర్వేలు ఫుల్!

- ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్న జనం
- సెలవు దినాల్లోనూ సిబ్బందికి సర్వేల పేరుతో వేధింపులు



నల్లచెరువు: సచివాలయం-2



కె. పూలకుంటలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్)

నల్లచెరువు: గ్రామీణ ప్రాంత ప్రజలు సత్వరమే పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. సచివాలయాల్లో ప్రస్తుతం ఎలాంటి సేవలు అందడం లేదు. గత వైఎస్సార్ సీపీ హయాంలో మండల కార్యాలయాలతో పని లేకుండా ప్రభుత్వ సంక్షేమ పతకాలు ప్రజలకు అందాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సచివాలయ సేవలను పక్కనపెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటా తిప్పుతోంది. దీంతో సచివాలయాల్లో సిబ్బంది లేక సేవలు అందక పోవడంతో ప్రజలు తమకు అవసరమైన సర్టిఫికెట్లకు మీసేవ కేంద్రాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఉద్యోగులపై పని ఒత్తిడి

మండలంలో 13 పంచాయితీలకు గానూ 10 సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక ఉద్యోగి చొప్పున సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సచివాలయ సిబ్బంది వలంటీర్ల సమన్వయంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ క్యాస్ట్ సర్టిఫికెట్ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల వరకూ అన్ని సేవలను సచివాలయాల ద్వారే అందించే వారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ సేవలకు స్వస్తి పలకడమే కాకుండా సచివాలయ సిబ్బందిని వివిధ రకాలైన సర్వేల పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సెలవు రోజులతో సంబంధంలేకుండా సర్వేలు చేయాలని ఆదేశించడం టార్గెట్లు పెట్టడం మాతృ శాఖ పనులతో పాటూ బీఎల్ఓ విధులు ఇలా అన్ని రకాలైన పనులు చేయాలని ఉన్నతాధి కారులు ఆదేశిస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. సర్వేల కోసం సచివాలయ సిబ్బంది వీధి వీధిలా తిరగడంతో సచివాలయాలు వెలవెల బోతున్నాయి.

సర్వేలతో సతమతం

సచివాలయ ఉద్యోగులను సర్వేలకు పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయాలి. పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు ఆధార్ నమోదు వంటి ప్రక్రియను నిర్వహించాలి. వర్క్ ఫ్రం హోం పేరుతో 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు ఉన్న వారి జాబితాను తయారు చేయాలి. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్‌తో పీ-4సర్వే నాన్ ఏపీ రెసిడెన్సియల్ వారిని గుర్తిండం హౌస్ జియో ట్యాగింగ్ వంటి సర్వేలు చేయిస్తున్నారు. ఇంటింటా తిరిగి సర్వే చేస్తున్నా ఇంటి యజమానికి సెల్ కు వచ్చే ఓటీపీ చెప్పకపోతే చేసిన పనంతా వృథా అవుతోందని సర్వేని మళ్లీ మొదటి నుంచి చేయాల్సి వస్తోందని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు.

ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు



గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయాలకు వెళ్లి పనులు చేయించుకునే వాళ్లం. ఇప్పుడు సచివాలయ సేవలు లేకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మీసేవా కేంద్రాలు, మండల కార్యాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వ ఆలోచించి సచివాలయ సేవలను కొనసాగించాలి.

–జొన్నా ఆదిమూర్తి, దేవిరెడ్డిపల్లి, నల్లచెరువు మండలం

గతంలో అన్ని సేవలూ అందేవి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందేవి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై సమాచారం అందించే వారు. ఏవైనా సర్టిఫికెట్లు కావాలంటే దరఖాస్తు చేసుకుంటే అక్కడే ఇచ్చే వారు.ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సర్టిఫికెట్లు కావాలంటే మీ సేవ, మండల కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడంది.

–మంజునాథ నాయుడు, పెద్దయల్లంపల్లి, నల్లచెరువు మండలం

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



ధర్మవరంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు



తహసీల్దార్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

కదిరి టౌన్: పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతానాగరాజు ఆధ్వర్యంలో బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు, బీజేపీ నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని పోరాటాలు చేశారని నాయకులు పేర్కొన్నారు. నాయకులు నాగేంద్ర, సుబ్బయ్య నాయక్, అనిల్, నాగభూషణం, బీజేపీ నాయకులు తలుపుల గంగాధర్, పిట్ల రామక్రిష్ణ, నందిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. స్మిత పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు హైదరవలీ, జేవీ రమణ, చెన్నారెడ్డి, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్ : మహాత్మ జ్యోతిరావ్‌పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లోనున్న పూలే విగ్రహానికి శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డె తిరుపతయ్య, సహాయ కార్యదర్శి బి.వెంకటరమణ, పట్టణాధ్యక్షుడు బండి వెంకటేష్, ఉపాధ్యక్షులు రవి, జంగమన్న, సహాయ కార్యదర్శి తిరుపాలు, కోశాధికారి కొండయ్య, డైరెక్టర్లు అన్నం లక్ష్మినారాయణ, వెంకట్రాముడు, శంకరయ్య, నారాయణ, సత్యం, ఈశ్వరయ్య, నాగేంద్ర, శివయ్య, నరేష్, గుండా పుల్లయ్య, చంద్రశేఖర్, లక్ష్మినారాయణ, భాను తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరప్ప, ముత్యాలప్ప, నాగప్ప, రాంప్రసాద్, లక్ష్మన్న, మధుసూదన్, నాగేంద్ర, భాస్కర్, నరసింహులు ఎల్‌పీ సర్కిల్‌లోనున్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జ్యోతిరావుపూలేకు నివాళి

చెన్నేకొత్తపల్లి: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాల్లో జరుపుకున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో జ్యోతిరావు పూలే సేవలను కొనియాడారు.

సామాజిక దార్శనికులు జ్యోతిరావు పూలే

పుట్టపర్తి టౌన్: కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక దార్శనికులు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్పీరత్న అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రత్న పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దళిత బహుజనులు, మహిళల అభ్యున్నతి కోసం పూలే జీవిత కాలం శ్రమించారన్నారు. మహిళలు విద్యావంతులు కావాలని, తన భార్య సావిత్రీబాయ్‌ను పాఠశాలకు పంపి ఆదర్శంగా నిలిచారన్నారు. ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐ వలి, సీఐలు శ్రీనివాసులు, సతీష్, తిమ్మారెడ్డి, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు ప్రదీప్‌సింగ్, వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీరాములు పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలోని స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రజాసంఘాల నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎద్దుల రాముడు, సురేంద్ర, శ్రీనివాసులు, బాదుల్లా, రాజశేఖర్, ఆంజనేయులు, బాబు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేయండి

కనగానపల్లి: విద్యార్థులు, నిరుద్యోగ యువతకి ఉపయోగపడే పుస్తకాలను స్థానిక గ్రంథాలయానికి వితరణ చేయాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు కోరారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో శుక్రవారం కొందరు దాతలు సుమారు వంద పుస్తకాలను గ్రంథాలయానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథాలయాధికారి మాట్లాడారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడే పుస్తకాలు తక్కువగా ఉన్నాయన్నారు. దాతలు, విద్యావంతులు ముందుకు వచ్చి అకడమిక్ పుస్తకాలతో పాటు నవోదయ, ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను వితరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంజునాథ్, ఉపాధ్యాయుడు బాబ్జాన్, యోగా గురువు సుబ్బరాయుడు, గ్రామస్తులు తిప్పయ్య, వీరనారప్ప, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కదిరి అర్బన్: కాళసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలయ్యాయి. యర్రదొడ్డి గ్రామానికి చెందిన అశోక్ కుమార్ తన భార్య అమృతను నల్లమాడలోని ఆసుపత్రిలో చూపించేందుకు బైక్‌పై బయలుదేరాడు. కాళసముద్రం వద్దకు రాగానే ఎదురుగా అనంతపురం వైపు నుంచి కదిరి వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో గాయపడిన వారిని స్థానికులు కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఏపీజీబీలో 17 నుంచి పంట రుణాల రెన్యూవల్

కనగానపల్లి: ఖరీఫ్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులకు ఈనెల 17వ తేదీ నుంచి రెన్యూవల్ చేస్తామని మామిళ్లపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఖరీఫ్‌లో పంట రుణాలు పొందిన రైతులు సంవత్సరం గడువులోపు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా వారికి కేటాయించిన తేదీల్లో రైతులు అన్ని ఆధారాలు తీసుకుని బ్యాంకు వద్దకు వచ్చి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల 17వ నుంచి 19వ తేదీ వరకు రాప్తాడు మండలం చాపట్ల, గొల్లపల్లి, 21 నుంచి 24 వరకూ మరూరు, చెర్లోపల్లి, ఇక 25 నుంచి 28 వరకు పర్వతదేవరపల్లి, 29 నుంచి మే 2 వరకూ ముక్తాపురం, మే 3 నుంచి 6 వరకూ మామిళ్లపల్లి, 7 నుంచి 12 వరకూ కుర్లపల్లి, తాండా, 13 నుంచి 17 వరకూ చంద్రాచెర్ల, మే 26 నుంచి 28 వరకూ దాదులూరు గ్రామాల రైతులు రుణాలు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ సోమశేఖర్

బత్తలపల్లి: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో పోలీసులు, పాత్రికేయుల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. పాత్రికేయుల జట్టు కెప్టెన్ జాంపుల అజయ్, పోలీసుల జట్టు కెప్టెన్ సుదర్శన్‌నాయుడు టాస్ ఎగురవేశారు. టాస్ గెలిచిన పాత్రికేయుల జట్టు కెప్టెన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 78 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పోలీసుల జట్టు 9.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసి రెండు వికెట్లు తేడాతో గెలుపొందింది. పాత్రికేయుల జట్టులో మదనాపు కృపాకర్ మూడు క్యాచ్‌లు తీసుకొని, బౌలింగ్‌లో వికెట్ తీశాడు. వెంకటదర్శన్ మూడు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పోలీస్ కెప్టెన్ సుదర్శన్‌నాయుడు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా వెంకటదర్శన్ ఎంపికయ్యారు. వారికి ఎస్ఐ సోమశేఖర్ చేతులు మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. క్రికెట్ కోచ్ జయరాం, మండల పాత్రికేయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



మురళి(ఫైల్)

ఎన్‌పీకుంట: గూటిబైలు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న యాకాసి మురళి (40) మృతికి పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుడు మురళి అనారోగ్యంతో గురువారం తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని శుక్రవారం అతని సొంత గ్రామం తలుపుల మండలం బండ్లపల్లికి తీసుకువచ్చారు. ఎంఈఓ గోపాల్‌నాయక్, ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ, ఉపాధ్యాయులు మురళి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కేసు నమోదు

కదిరి అర్బన్: దాడి ఘటనలో ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని అమీన్‌నగర్‌కు చెందిన సుబ్రమణ్యంపై శుక్రవారం వ్యవసాయమార్కెట్ యార్డ్ సమీపంలో వసీం అనే వ్యక్తి దాడి చేశాడు. బైక్ తాకట్టు విషయంలో దాడి జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఉపకరణాల పంపిణీ

ఓడీచెరువు: భవిత కేంద్రంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను పంపిణీ చేసినట్లు ఐఈఆర్టీలు నాగశేఖర్ రెడ్డి, నరసింగబాబు తెలిపారు. ఎంఈఓ సురేష్‌బాబు మాట్లాడుతూ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నిర్మల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెరికల్చర్ అసిస్టెంట్‌కు సన్మానం

ధర్మవరం రూరల్: కుణుతూరు ఆర్ఎస్‌కేలో సెరికల్చర్ అస్టిసెంట్ ఎం. కరుణాకర్‌యాదవ్ ఆ శాఖ టెక్నికల్ అస్టిసెంట్‌గా పదోన్నతి పొందడంతో శుక్రవారం అధికారులు అతడిని ఘనంగా సన్మానించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ క్రిష్టయ్య, ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి, ఏఓలు ముస్తఫా, చెన్నవీరాస్వామి హాజరయ్యారు. రైతులకు చేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వం పదోన్నతిని కల్పించిందని వారు పేర్కొన్నారు. వ్యవసాయ సంచాలకుల సిబ్బంది రంగస్వామి, రాఘవేంద్ర, ఇమ్రాన్, ఏఈఓలు మురళీ, అశ్వని పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లచెరువు: మండల కేంద్రంలోని విశ్వకవి యోగి వేమన ఆలయంలో త్రైత సిద్ధాంతం ప్రభోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్లను ఆవిష్కరించారు. సేవా సమితి సభ్యులు వెంకటరాముడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరుగురికి రిమాండ్

ముదిగుబ్బ: రాఘవంపల్లిలో రెండు నెలల క్రితం పొలం రస్తా విషయంలో ఇరువర్గాల వారు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న విషయం విదితమే. ఘటనలో ఆరుగురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ధర్మవరం రూరల్: ఓబుళనాయనపల్లి తండాలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటుసారా తయారు చేస్తున్న చాంప్లానాయక్, రవినాయక్ అరెస్ట్ చేసి 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. 30 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి, పుట్టపర్తి ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు హరిక్రిష్ణ, సునంద, ఎస్ఐలు చాంద్‌బాషా, నాగరాజు, ధర్మవరం రూరల్ ఏఎస్ఐ నాగరాజు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం

కదిరి టౌన్: పట్టణంలో శుక్రవారం అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏపీ రైతు సంఘం నాయకులు రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11న స్వాతంత్రోద్యమంలో భాగంగా అఖిల భారత కిసాన్ సభ ఏర్పడిందన్నారు. రైతు సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, ఆంజనేయులు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలో శుక్రవారం ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర కోసం పోరాడిన ఘనత ఏఐకేఎస్ ఉందన్నారు. ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, వెంకటస్వామి, హరి, సీఐటీయూ నాయకులు జెవి.రమణ, అయుబ్‌ఖాన్, ఆదినారాయణ, హైదర్ వలి, రైతులు శంకర్, ఆది, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేష్‌రెడ్డి



రేగాటిపల్లి సురేష్‌రెడ్డి

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం రేగాటిపల్లి గ్రామానికి చెందిన అప్పిరెడ్డిగారి సురేష్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి పదవి ఇవ్వడం పట్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

16న సంతలు, షాపింగ్ రూముల బహిరంగ వేలం

పుట్టపర్తి టౌన్: ఈనెల 16న కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వారపు సంత, దినసంత, సులభ్ కాంప్లెక్స్, షాపింగ్ రూములకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి నాగరాజు శుక్రవారం తెలిపారు. సర్పంచ్ రాధా ఆధ్వర్యంలో జరిగే ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. డిపాజిట్ చెల్లించడంతోపాటు ఆస్తి విలువ సర్టిఫికెట్ అందజేసిన వారు మాత్రమే వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

మూర్తిపల్లిలో నీటి సమస్య తీర్చాలి



మున్సిపల్ డీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తాగునీటి సమస్య తీర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ డీఈకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూర్తిపల్లి, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఆర్య వైశ్య శ్మశాన వాటికి నుండి మూర్తిపల్లి వరకు వీధి లైట్లు లేక రాత్రి పూట ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారన్నారు. నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

సంతులిత ఆహారంతో ఆరోగ్యం

తనకల్లు: శిశువుకు సంతులిత ఆహారాన్ని అందిస్తే మంచి ఆరోగ్యంతో ఉంటాడని ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి అన్నారు. గందోడివారిపల్లిలో శుక్రవారం ' సహీ పోషణ్- దేశ్ రోషన్ ' కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రెస్ట్, కాంప్లిమెంటరీ ఫీడింగ్‌పై తల్లులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం కేంద్రాల్లో పండిన ఆకుకూరలు, కూరగాయలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ రెడ్డెప్ప, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జయమ్మ, రఫీమున్నీసా, వాసన్ ప్రతినిధి రామమోహన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ సరస్వతి, సూపర్‌వైజర్ లలితమ్మ కిశోర్ బాలికలు, గర్భిణులకు రక్త హీనతపై అవగాహన కల్పించారు.

వీధి బాలల సంరక్షణ అందరి బాధ్యత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పీడీ శ్రీదేవి, డీసీపీఓ మహేష్

ధర్మవరం అర్బన్: వీధి బాలల సంరక్షణ అందరి బాధ్యత అని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోనున్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీడీపీఓ లక్ష్మి, ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో వలస కుటుంబాలు, అనాథలు, భిక్షాటనకు గురవుతున్న కుటుంబాల వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీదేవి, డీసీపీఓ మహేష్ మాట్లాడుతూ అనాథ బాలలు, ఆశ్రయం అవసరం ఉన్న పిల్లలకు స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాం, బాలసదనంలో వసతులపై అవగాహన కల్పించారు. పాఠశాలకు అర్హులైన 15 మంది చిన్నారులను తిరిగి పాఠశాలలో చేర్పించడానికి చర్యలు చేపట్టామని వారు తెలిపారు. ఇద్దరు అనాథ బాలికలను కస్తూర్బా పాఠశాలలో చేర్పించేందుకు ప్రక్రియను పూర్తి చేసినట్లు చెప్పారు. సచివాలయ మహిళా పోలీసు ఉషారాణి, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.